# మాతృదేవోభవ

-వాణిశ్రీ

అక్టోబర్, ఒకటో తేదీ. అవంతి డిగ్రీకాలేజీ 'వరల్డ్ ఎల్డర్స్ డే' సందర్భంలో ప్రభుత్వం స్వచ్ఛంధ.సంస్థల సహకారంతో ఒక సదస్సు ఏర్పాటుచేసింది.

కాలేజీ అసెంబ్లీ హాలుకు 'సరస్వతీ సదన్' అని పేరు. అందులోనే సదస్సు మొదలైంది.

ప్రభుత్వం తరఫున సంక్షేమశాఖ మంత్రిగారు కొందరు ఎంపిక చేసిన పెద్దలకు శాలువాలు కప్పి, మెమంటోలు అందజేసి, పూల దండలు వేసి సన్మానం చేశారు.

కాలేజీకి చెందిన 'సరస్వతీ సదన్' ఫ్రీగా వాడుకున్నందుకు ఏమో, బాగుండదని పనిలో పనిగా ప్రిన్సిపాల్ రామనాథానికి కూడా సన్మానం చేశారు. తమ ప్రిన్సిపాల్‌గారికి కూడా సన్మానం జరుగుతున్నందున కాలేజీ స్టాఫ్, స్టూడెంట్స్ కూడా హాజరయ్యారు. ప్రిన్సిపాల్‌కి సన్మానం చేస్తున్నప్పుడు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేస్తూ, చప్పట్లు కొట్టి తమ సంతోషం వ్యక్తం చేశారు.

ప్రిన్సిపాల్ ఉబ్బితబ్బిబ్బైపోయి తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఉపన్యాసం ఇచ్చాడు.

"సభకు నమస్కారం. ప్రపంచ వృద్ధుల దినోత్సవం మన కాలేజీలో జరగడం మనందరికీ గర్వకారణం. ప్రపంచంలో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. మన దేశ జనాభాలో పది, పన్నెండు శాతం వృద్ధులున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వృద్ధుల విషయంలో శ్రద్ధ తీసుకుని 'నేషనల్ పాలసీ ఆన్ ఓల్డర్ పర్సన్స్' వెలువరించింది. అన్ని రాష్ట్రాల వారినీ ఆ విధంగా యన్.పి.ఓ.పి. అమలు చేయాలని కోరింది. రైల్వేలలో ముప్ఫై శాతం చార్జీలో రాయితీ ఇచ్చింది. మన ప్రభుత్వం వృద్ధులకు నెల నెలా పెన్షన్స్ అందజేస్తోంది. మహారాష్ట్రలో బస్సులలో కూడా రాయితీలు ఇస్తున్నారు.

మన రాష్ట్రంలో కూడా ఆర్టీసీ బస్సులో చార్జీలలో రాయితీలు ఏర్పాటు చేయవలసిందిగా, ప్రతీ జిల్లా కేంద్రాలలో వృద్ధులకు ప్రభుత్వం తరఫున వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నారు.

కేవలం వృద్ధుల సంక్షేమాన్ని ప్రభుత్వం పైనే వేయడం కాదు మనలో కూడా బాధ్యతలు పెరగాలి. ఈనాడు మనం చూస్తున్నాం. ఉద్యోగాలు చేస్తున్న వారు తల్లి దండ్రుల ఆలనాపాలనా చూడడం లేదు.

కొందరైతే తల్లిదండ్రులను ఇండియాలో వదిలేసి పోతున్నారు. ఇక్కడ వారు ముసలితనంలో ఒంటరి జీవితం అనుభవిస్తున్నారు. మనల్ని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను ముసలితనంలో పట్టించుకోకుండా వారిని వృద్ధాశ్రమాలలో వదిలేయడం, పల్లెటూళ్లల్లో ఒంటరి జీవితాన్ని గడుపుతున్నా తమ దగ్గర ఉంచుకోకుండా బాధ్యత లేకుండా ప్రవర్తించడం సిగ్గుచేటు. పెద్దలను గౌరవించడం మన ధర్మం. తల్లిదండ్రులు భగవంతునితో సమానం. వారి మనస్సులు కష్టపెట్టడం మహాపాపం."

రామనాథం ఉపన్యాసం అదిరిపోయింది. స్టాఫ్, స్టూడెంట్స్ మరొకమారు చప్పట్లతో హాలుని అదరగొట్టేశారు.

"కాబట్టి మనం మన తల్లిదండ్రులనే కాకుండా, వృద్ధులు అందర్నీ గౌరవించి, ప్రేమించడం, ఆదరించడం మన కనీస ధర్మం. భగవద్గీతలో భగవంతుడు ఏం చెప్పాడో మీకొకసారి గుర్తు చేస్తున్నాను. ఇతరులను సేవించే వాడే నాకు ఇష్టమైన భక్తుడు అన్నాడు. నిజం చెప్పాలంటే కేవలం పూజలు చేసిన వారు భక్తులు కాదు. భాగవతంలో వ్యాసుల వారు ఏం చెప్పారు? ఇతరులకు మేలు చేసే వారినే ఇతరుల కోసం జీవితాన్ని గడుపుతున్న వారినే భక్తులు అంటారని చెప్పారు. కాబట్టి ఈ ప్రపంచ పెద్దల దినోత్సవం సందర్భంలో నేను మనవి చేసేవి ఏమంటే పెద్దలకు సేవ చేద్దాం, పెద్దల కోసం జీవిద్దాం. వారి ముఖంలో కనబడే సుఖ సంతోషలను చూసి మనం గర్వపడదాం. మన కర్తవ్యం మనం నిర్వర్తిద్దాం"

రామనాథం ముగించి కూర్చున్నాడు.

హాలు చప్పట్లతో దద్దరిల్లింది. సభలో అందరి కంటే రామనాథం ఉపన్యాసమే హైలైట్ అని అంతా అనుకున్నారు.

★★★

సుధాకర్‌పై రామనాథం ఉపన్యాస ప్రభావం తీవ్రంగా పడింది.

అతని తల్లి గోవిందమ్మ పల్లెటూళ్లో ఒంటరిగా ఉంటోంది.

ఆమెను తీసుకుని రమ్మనీ, తనకు సహాయంగా పిల్లల ఆలనాపాలనా చూసుకుంటుందనీ అతని భార్య రుక్మిణి పోరుపెడుతోంది. కానీ సుధాకరే వినడం లేదు.

ఇప్పుడు ఉంటున్నది సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్. ఇబ్బంది లేకుండా ఉంది. అదీగాక తమది చిన్న ఇల్లు కావడంతో పనిమీద సిటీకి వచ్చే చుట్టాలు, చుట్టపుచూపుగా చూసిపోతున్నారేగానీ రాత్రిళ్లు ఉండిపోవడం లేదు. "అందుకే పెద్దలు ఇల్లు ఇరుకుగా ఉండాలన్నారని" మెచ్చుకుంటూ ఉంటాడు సుధాకర్.

తల్లిని తీసుకుని వస్తే డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ తీసుకోవాలి. అద్దె పెరుగుతుందని అతని ఆలోచన.

ఇక ఇప్పుడు రామనాథం ఉపన్యాస ప్రభావంతో 'మాతృదేవోభవ' అనుకుంటూ బెడ్‌రూ

ములు రెండు ఉండే ఇల్లు వెతుక్కునే బాధ్యత భార్యపై పెట్టేశాడు.

రుక్మిణి వెంటనే కాలనీ అంతా తిరిగి డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్స్ టూలెట్ బోర్డులున్నవి కనిపెట్టింది.

ఆదివారం నాడు భార్యాభర్తలు ఇద్దరూ వెళ్లి తమకు అనుకూలంగా ఉన్నదాన్ని ఎంచుకుని అందులోకి చేరిపోయారు.

సుధాకర్ తమ ఊరెళ్లి తల్లిని తీసుకొచ్చాడు. గోవిందమ్మ సంతోషించింది. ముసలితనంలో మనుమలతో హాయిగా కాలక్షేపం చేసే యోగం కలిగినందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంది. దేవుడే తనకు రామనాథం రూపంలో మంచి బుద్ధి ప్రసాదించాడని సుధాకర్ సంతృప్తి పడ్డాడు. తల్లిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఈ కాలం కొడుకుల్లా



కాకుండా మంచి కొడుకు అనిపించుకున్నాడు.

***

ఒకరోజు సుధాకర్ కూరగాయల మార్కెట్‌కి వెళ్లాడు.


"ఒరేయ్! కృష్ణుడూ! ఇన్నాళ్లూ ఎక్కడికి పోయావురా!" అంటూ ఒక ముసలమ్మ సుధాకర్‌ని పట్టుకుని వలవల ఏడుస్తోంది.

సుధాకర్ బిత్తరపోయాడు.

పాపం ఎవరో పండుముసలి. ముఖమంతా ముడతలు పడినా ఎంతో కళగా ఉంది.


ఎవరో మంచి కుటుంబంలో నుంచి వచ్చినట్లే కనిపిస్తోంది. మతిస్థిమితం లేదేమో?

తననే కొడుకు అనుకుంటున్నదేమో? ఆమె కొడుకు తన పోలికలతో ఉంటాడేమో! అనుకున్నాడు



## వివేకానందగా వెంకటేష్

ఏదైనా ఒక చారిత్రక, పౌరాణిక సినిమాలో నటించాలని వెంకటేష్ భావిస్తున్నట్టుగా కొంత కాలంగా వినిపిస్తున్నా అదింత వరకూ కార్యరూపం దాల్చలేదు. కానీ అతి త్వరలోనే ఇది నిజమయ్యే అవకాశాలున్నాయంటున్నారు. 'స్వామి వివేకానంద' జీవితచరిత్ర ఆధారంగా నిర్మించే సినిమాలో స్వామి వివేకానందగా వెంకటేష్ నటించవచ్చని కె.రాఘవేంద్రరావు ఈ సినిమాకి దర్శకత్వం నిర్వహిస్తారని అంటున్నారు. 'రంగ పాండురంగ' నిర్మాణం పూర్తి కాగానే రాఘవేంద్రరావు ఈ 'స్వామి వివేకానంద' సినిమా దర్శకత్వం వహిస్తారని చెబుతున్నారు.




కొందరు ఆగి తమనే చూస్తూ ఉండడంతో ఇబ్బందిగా అనిపించింది అతనికి.

"పాపం ఎవరో దిక్కులేని ముసలమ్మ. నా అనే వాళ్లు లేరేమో? ఈమెను ఆదుకోవాల్సిందే" అనుకున్నాడు.

"అమ్మా! ఎవరమ్మా నువ్వు?" అని అడిగాడు సుధాకర్.

"అదేంటిరా? తల్లిని పట్టుకుని ఎవరని అడుగుతున్నావా?" అని ఆమె ఏడుపు తీవ్రం చేసింది.

ఇక ఆమెను ఏం ప్రశ్నించగూడదని అనుకున్నాడు.

"సరే! పద" అని ఆమెను ఆటోలో ఎక్కించుకుని కాలేజీ హాస్టల్‌కి తీసుకెళ్లాడు. ఆమెను లేడీస్ హాస్టల్లో ఖాళీగా ఉన్న రూమ్‌లో ఉంచి అక్కడ అటెండర్ రత్తమ్మకి అప్పగించాడు.

ముసలమ్మకి మతిస్థిమితం లేదనీ, తననే కొడుకని భావిస్తున్నదనీ కొన్నాళ్లు ఉంటుందనీ, ఆమె బాగోగులు చూడమని చెప్పాడు. రత్తమ్మ తల ఊపింది.

"అమ్మా! నువ్వు ఇక్కడ ఉండు. నీకేం కావాలన్నా ఇదుగో ఈ రత్తమ్మని అడుగు." అన్నాడు సుధాకర్.

"కృష్ణుడూ! నన్ను ఇంటికి తీసుకెళ్లవా? పిల్లల్ని చూపించవా?" అన్నది.

"ఇప్పుడు అర్జెంట్ పని మీద వెళ్తున్నానమ్మా! తర్వాత తీసుకెళ్తాను." అన్నాడు ఆమెకు నచ్చజెప్తూ.

"కోడలి మాట విని నన్ను ఇంట్లో నుంచి వెళ్లగొట్టిన వాడివి. నన్ను తీసుకెళ్తావా? మాయమాటలు చెప్తావు. నన్ను తీసుకెళ్లవురా! నాకు తెలుసు" అని ఏడవసాగింది.

సుధాకర్‌కి ఆమె పరిస్థితి అర్థమైంది.

కానీ ఏం చేయగలడు? ఆమెను ఓదార్చమని రత్తమ్మకి సైగ చేసి వెళ్లిపోయాడు.

***

సైక్రియాట్రిక్ డాక్టర్ మృణాళినికి ఆమెను చూపించాడు సుధాకర్. ఆమెను చూస్తూనే గుర్తుపట్టింది మృణాళిని.

ఆమె పేరు రాజమ్మనీ, పి.యన్.ఆర్. ఓల్డ్‌ఏజ్‌డ్ హోమ్‌లో ఉంటుందనీ చెప్పింది.

అప్పుడప్పుడూ హోమ్ నుంచి తప్పించుకుని తిరుగుతూ ఉంటుందని రెగ్యులర్‌గా మందులు వాడాలన్నది.

వారం రోజులు శ్రద్ధగా మందులు వాడించేటప్పటికి రాజమ్మ కోలుకుంది. మామూలు మనిషైంది.

కానీ ఇప్పుడు ఎవరితోను మాట్లాడ్డం లేదు. మతి స్థిమితం లేనప్పుడు తన మనసులోని మాటలు పైకి వెల్లడించేది. స్థిమిత పడ్డాక మౌనంగా ఉండిపోతోంది.

ఇక రాజమ్మను ఓల్డేజి హోమ్‌కి పంపించాలని నిర్ణయించుకున్నాడు సుధాకర్.

సుధాకర్ ఎవరో ముసలమ్మను ఆదరించి ట్రీట్‌మెంట్ ఇప్పించాడనీ, ఇప్పుడు ఆమె కోలుకున్నదనీ ఎవరో ప్రిన్సిపాల్ చెవిన వేశారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌ని పిలిచి అసెంబ్లీ సమావేశంలో అందరి ముందూ బొకే ఇచ్చి మెచ్చుకున్నాడు.

అంతా సుధాకర్ మాదిరి పెద్దల పట్ల దయ కలిగి ఆదరించాలనీ, సుధాకర్‌ని ఆదర్శంగా తీసుకోవాలనీ కోరాడు.

అసెంబ్లీ సమావేశం ముగిసిన తర్వాత, "సార్! ఈరోజు ఆమెను పంపించి వేస్తున్నాం. ఆమెకు కొత్త చీరలు కొన్నాం. మీ చేతుల మీదుగా ఇచ్చి వీడ్కోలు చెప్తే బాగుంటుంది." అన్నాడు.

"అలాగా! ఐతే అదొక ఈవెంట్‌గా నిర్వహిద్దాం. పేపర్లో వస్తే అందరికీ తెలుస్తుంది. జర్నలిస్టులకి ఫోన్ చేద్దాం." అన్నాడు ప్రిన్సిపాల్.

సుధాకర్ ఏం మాట్లాడలేదు.

ప్రిన్సిపాల్ తన ఛాంబర్‌కి వెళ్లి ప్రెస్ జర్నలిస్టులకి, మీడియా వాళ్లకి ఫోన్లు చేశాడు.

సాయంకాలం సరస్వతీ సదన్‌లో మీటింగ్ ఉందని నోటీసు పంపడంతో కాలేజీ స్టాఫ్, స్టూడెంట్స్ చేరారు.

★★★

టీవీ మీడియా వాళ్లు, ప్రెస్ జర్నలిస్టులు సరస్వతీ సదన్ స్టేజీ ముందు గుమిగూడారు.

సభ మొదలైంది.

రామనాథం సుధాకర్ చేసిన మంచి పని వివరించాడు.

"పెద్దలను ఆదుకోవాలనే మంచి మనసుతో ముక్కూ మొఖం తెలియని వృద్ధురాలిని చేరదీశాడు. మతి స్థిమితం లేని ఆమెకు ట్రీట్‌మెంట్ ఇప్పించి మనిషిని చేశాడు. అందరూ సుధాకర్‌ని ఆదర్శంగా తీసుకోవాలి. వృద్ధులు మనకు భారం కాదు. మనకి కొండంత అండ అని గ్రహించాలి. మాతృదేవోభవ, పితృదేవోభవ అనే ఆర్యోక్తిననుసరించి మన తల్లిదండ్రుల్ని ప్రేమగా చూసుకోవాలి" అంటూ సుధాకర్‌కి పూలదండ వేసి, శాలువా కప్పి సన్మానం చేశాడు.

సుధాకర్ మాట్లాడుతూ "ప్రపంచ పెద్దల దినోత్సవం రోజున మన ప్రిన్సిపాల్‌గారు చేసిన ఉపన్యాసంతో ప్రభావితుడినయ్యాననీ, తన తల్లిని పల్లెటూరి నుంచి తీసుకు వచ్చి ఇంట్లో పెట్టుకున్నాననీ, అలాగే ఒక వృద్ధురాలికి సహాయ పడ్డాననీ" చెప్పాడు.

ప్రిన్సిపాల్ రామనాథం సంతోషించాడు.

తర్వాత సుధాకర్ స్టేజీ దిగి రాజమ్మను పైకి తీసుకురావాలని ప్రయత్నిస్తుంటే ఆమె ఒప్పుకోవడం లేదు.

రానని మొండికేసి తిరిగింది. మీడియా వాళ్లు అదంతా గమనించి కెమేరాలతో షూట్ చేస్తుంటే సుధాకర్ రాజమ్మకు నచ్చజెప్పి స్టేజీ పైకి తీసుకెళ్లి కుర్చీలో కూర్చోబెట్టాడు.

"ఇప్పుడు మన ప్రిన్సిపాల్‌గారు రాజమ్మగారిని కొత్తదుస్తులతో సత్కరిస్తారు" అని ఎనౌన్స్ చేశాడు సుధాకర్.

సుధాకర్ కొత్త దుస్తులు ప్రిన్సిపాల్ చేతికి ఇచ్చి రాజమ్మకు ఇవ్వమని సూచించాడు.

రామనాథం రెండు కేరీ బ్యాగ్స్ రాజమ్మ చేతికి అందించాడు.

అంతే!

రాజమ్మ కోపంతో ఊగిపోతూ ఆ రెండు కేరీ బ్యాగ్‌లు రామనాథం మొఖం మీదకి విసిరికొట్టి చరచర స్టేజీ నుంచి దిగిపోయింది.

రామనాథం మొఖం నల్లగా మాడిపోయింది. కాలేజీ స్టాఫ్, స్టూడెంట్స్ షాక్ తిన్నట్లయి పోయారు.

అంతా క్షణాలలో జరిగిపోయింది. సుధాకర్ అవాక్కయ్యాడు. టీవీ కెమేరా వాళ్లు, పత్రికా ప్రతినిధులు రాజమ్మను చుట్టుముట్టారు. ప్రశ్నల వర్షం కురిపించారు.

"అమ్మా! మీరు ప్రిన్సిపాల్‌గారిచ్చిన కొత్త దుస్తులు ఎందుకు తీసుకోలేదు?"

"మీకు ఉచితంగా తీసుకోవడం ఇష్టం లేదా?"

"ఇష్టం లేకపోతే ఆ మాట చెప్పవచ్చుగా! ఆయన మొఖం మీదకు విసిరి కొట్టడం ఏమిటి? మర్యాదగా ఉందా? మీకు ఆరోగ్యం బాగా లేకపోతే కొన్ని రోజులు ఆదరించి ట్రీట్‌మెంట్ ఇప్పించిన కాలేజీకి ఆయన పెద్ద. అటువంటి పెద్దమనిషిని స్టేజీ మీద అవమానపరుస్తారా?"

"హూ..పెద్ద? వాడా పెద్దమనిషి? పెళ్లాం మాటలు విని తల్లిని ఇంటి నుంచి గెంటేసి ఆశ్రమంలో చేర్పించిన వాడా పెద్దమనిషి?" రాజమ్మ నోరు విప్పింది.

అంతా ఆశ్చర్యపోయారు.

"ఏమిటమ్మా నువ్వనేది? రామనాథంగారు తల్లిని వృద్ధాశ్రమంలో చేర్పించారా?"

"మీకెలా తెలుసు?"

"నేనే వాడి తల్లిని" దుఃఖంతో బొంగురుపోయిన కంఠంతో చెప్పింది రాజమ్మ.

అందరి కళ్లు ఒక్కసారిగా రామనాథం కోసం వెదికాయి.

రామనాథం ఆ చుట్టుపక్కల ఎక్కడా కనిపించలేదు.

★

## జైల్లో చేర్చుకోమన్న రాజీవ్

ఒరిస్సాలోని బాలసోర్ జిల్లాలో 22 సంవత్సరాల రాజీవ్‌గాంధీ ప్రధాన్ అనే అతను మాజీ సైనికుని కుమారుడు. తండ్రి మరో పెళ్లి చేసుకుని కుటుంబాన్ని వీధిలోకి పడేసాడు. తనకు ఉద్యోగం లేదనీ, తన తల్లిమీద ఆధారపడడం ఇష్టంలేదనీ, తనని జైలులో చేర్చుకోండని జైలుకి వచ్చి ప్రార్థించాడుట. అక్కడయితే తిండి పెట్టి, ఉండటానికి చోటు ఇస్తారని అతని ఆశట. జైలువాళ్లు కేకలేస్తే 'తనని చేర్చుకోకపోతే ఏదో నేరంచేసి జైలుకు మరీ వస్తానని' చెప్పాడట అతను.

## జమాయినగర్

రాంచీకి దగ్గర్లో ఆసాగీ గ్రామంలో 30 సంవత్సరాలనాడు ఒకతను తన కూతుర్ని పెళ్లి చేసుకుంటే అల్లుడికి కొంత భూమిని ఇస్తానన్నాడు. అయితే అల్లుడు ఇల్లరికముండాలన్నాడు. దానికి మొహమాటపడిన అల్లుడు ఆ భూమిలో ఇల్లు కట్టిస్తే ఊళ్లో ఉంటానన్నాడు. అలా ఆ పేటలోకి అల్లుడు రావడం ఆరంభమయ్యాక ఇప్పటికి 20 మంది అల్లుళ్లు మామలు కట్టించిన ఇళ్లల్లో ఉంటున్నారుట. చివరకు ఆ పేటకి జమాయినగర్ (అల్లుళ్ల పేట) అనే పేరు వచ్చింది.

-తటవర్తి

